క్లుప్తంగా

జనక్ ప్రసాద్‌కు సన్మానం



పుష్పగుచ్ఛం అందిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్‌ను సన్మానించారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ఐఎన్టీయూజీ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యులు బాబర్ సలీంపాషా నివాసంలో ఆయనను సన్మానించారు. బాబర్ మాట్లాడుతూ ఐఎన్టీయూసీలో సుదీర్ఘ సేవలందించిన జనక్ ప్రసాద్‌ను కాంగ్రెస్ గుర్తించి చైర్మన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు బండారి కనకయ్య, కందుల స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడికి సన్మానం



సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా, నాయకుడిగా సేవలు అందించిన గుజ్జుల సత్యనారాయణను ఆదివారం సన్మానించారు. ఎన్టీపీసీ రామగుండంలో సీఅండ్ఐ విభాగంలో సీనియర్ కాంట్రాక్టు కార్మికుడిగా ఉద్యోగ విరమణ పొందుతున్న క్రమంలో పెద్దపల్లి మల్టిపుల్ కాంట్రాక్టు మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇజ్జగిరి భూమయ్య అధ్యక్షతన ఆయనను సన్మానించారు.

నిత్యావసరాలు అందజేత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఉప్పులేటి మధునయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మృతుడి భార్య లలితకు శ్రీసీతారామ సేవా సమితి(వాట్సప్ గ్రూప్) సభ్యులు రూ.3 వేలు, కార్తీక్ అందించిన రూ.2వేలు మొత్తంగా రూ.5వేల విలువ గల సరుకులు అందించారు. గ్రూపు సభ్యులు గోలివాడ చంద్రకళ, రామస్వరూప, మేడగోని స్వప్న, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పురాతన ఆలయానికి తరలిరండి



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన సంతాన వేణుగోపాలస్వామి ఆలయం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సిద్ధం చేశారు. ఆలయానికి రంగులు వేయడంతో పాటు చుట్టుపక్కల భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. 18 నుంచి 22వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, లోక కల్యాణం కోసం భక్తులు నిత్యం భజన చేయనున్నట్లు అర్చక బృందం సభ్యులు వెంకటాచార్యులు, వేణుమాధవాచార్యులు, శ్రవణ్ కుమార ఆచార్యులు పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు స్థలం పరిశీలన



నాగెపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

రామగిరి: మండలంలోని నాగెపల్లి గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అంబేడ్కర్ సంఘం నాయకులు ఆదివారం స్థల పరిశీలన చేశారు. నాగెపల్లి ప్రధాన చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అన్ని పార్టీల నాయకులు విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని, ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. రోడ్డు నిర్మాణం పూర్తి కాగానే విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభిస్తామన్నారు. అంబేడ్కర్ సంఘం నాయకులు గద్దల శంకర్, కొవ్వూరి బాణేష్, నాగెపల్లి మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలుయాదవ్, రేణికుంట్ల కొమురయ్య, బడికల శ్రీనివాస్, క్యాదాసి రమేశ్, బూడిద సమ్మయ్య, కన్నూరి కైలాష్, కుమార్ పాల్గొన్నారు.

ఆవుపేడతో అగర్‌బత్తులు, దూప్‌స్టిక్స్

- ప్రకృతికి మేలు చేసేలా తయారు చేస్తున్న అర్చకులు శ్రవణ్‌కుమార్ శర్మ



అగర్ బత్తులు తయారు చేస్తున్న శ్రవణ్‌కుమార్ శర్మ

యైటింక్లయిన్‌కాలనీ: ఆలయాలతో పాటు ఇళ్లలో నిత్యం పూజ గదిలో వాడే అగరబత్తులు, సెంటెడ్ వంటివి వాడడంతో చాలా మందికి అనారోగ్యం కలుగుతోంది. ఎందుకుంటే అవన్నీ హానికర రసాయనాలు కలిపి తయారు చేసినవి. అయితే ఎలాంటి హాని లేకుండా ఆరోగ్యంతో పాటు మంచి సువాసన కలిగిన అగర్ బత్తులు, దూప్‌స్టిక్స్ తయారు చేస్తున్నారు రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి, శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయ అర్చకులు శ్రవణ్‌కుమార్ శర్మ. ఆవుపేడతో పాటు తులసి ఆకులు, వేపఆకులు, పచ్చ కర్పూరం, గుగ్గిలం, మల్లె పూలు, కొబ్బరి పీచులు ఉపయోగించి అగర్ బత్తులు, దూప్ స్టిక్స్ తయారు చేస్తున్నారు.

అగర్‌బత్తులు, దూప్‌స్టిక్స్..

కరోనా సమయంలో వచ్చిన ఆలోచన ప్రకృతి సిద్ధమైన అగర్ బత్తులు, దూప్‌స్టిక్స్ తయారు చేసి భక్తులకు, ఆలయాలకు అందించాలని శ్రవణ్‌కుమార్ శర్మ నిర్ణయించుకున్నారు. దాని కోసం ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో యంత్రాన్ని కొనుగోలు చేశారు. కానీ యంత్రం సరిగా పనిచేయక పోవడంతో భద్రాచలం, తదితర ఏరియాల్లోని ఆలయాలలో ఇవి తయారు చేస్తున్న వారి ద్వారా సలహాలు, తయారు చేసే విధానాన్ని తెలుసుకొని పని ప్రారంభించారు. కొన్ని ఆలయాలతో పాటు భక్తులకు విక్రయిస్తూ కొంతమేర ఆదాయం పొందుతున్నారు. ప్రకృతి సిద్ధమైన అగర్ బత్తులు, దూప్‌స్టిక్స్ కోసం 94911 69163 నంబర్‌ను సంప్రదించాలి

విగ్రహాలకు ముసుగు.. వాల్‌రైటింగ్ తొలగింపు



మంథని: ముసుగు వేయిస్తున్న కమిషనర్



పెద్దబొంకూర్‌లో బోర్డు తొలగిస్తున్న సిబ్బంది



సుల్తానాబాద్: వాల్‌రైటింగ్ తొలగిస్తున్న సిబ్బంది

మంథని: సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో మంథని మున్సిపల్‌తో పాటు డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీ నాయకుల విగ్రహాలకు ముసుగేస్తున్నారు. అలాగే ఆయా పార్టీల ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్ తొలగించే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ స్వయంగా పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా శిలాఫలకాలకు పేర్లు ఏర్పడకుండా స్టిక్కరింగ్, విగ్రహాలకు ముసుగులు వేయడం లాంటివి చేయిస్తున్నారు.

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నగరా మోగింది.. శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అధికార యంత్రాంగం ఎన్నికల కమిషన్ నిబంధనల అమలుకు రంగంలోకి దిగింది. గోడలపై నేతల పేర్లు, బొమ్మలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించడంలో నిమగ్నమైంది. పెద్దపల్లితో పలు గ్రామాల్లో ఇలా గోడలపై రాతలు చెరిపేస్తూ.. నేతల ఫొటోలు తొలగిస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ రైటింగ్‌ను మున్సిపల్ అధికారులు తొలగించారు. ఆదివారం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని అధికారులు చెప్పడంతో మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ ఆదేశంతో ఫ్లెక్సీలతోపాటు వాల్ రైటింగ్‌ను తొలగిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

సీహెచ్‌పీలో దుమ్ము సమస్య పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3 సీహెచ్‌పీలో దుమ్ము సమస్య నివారించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం ఓసీపీ–3 సందర్శనకు వచ్చిన కోల్‌మినిస్ట్రీ ఆఫ్ అడిషనల్ సెక్రటరీ విస్మితతేజ్, సంస్థ సీఅండ్ ఎండీ బలరాంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఓసీపీ–3లో దుమ్ము సమస్య విపరీతంగా ఉందని, కార్మికులు శ్వాసకోస సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఇటీవల రూ.1.50కోట్లతో ప్రత్యేక యంత్రాన్ని అమర్చినా డస్ట్ నియంత్రణ కావడంలేదని పేర్కొన్నారు. ఓసీపీ–3 సీహెచ్‌పీ నుంచి ఓసీపీ–1 సీహెచ్‌పీ వరకు రోడ్డు పూర్తిగా శిథిలమైందని, వెంటనే కొత్త రోడ్డు వేయాలన్నారు. జూనియర్ ఇసిస్టెంట్ ఇంటర్నల్‌పోస్టుల్లో ఆర్‌ఓఆర్ ప్రకారం అభ్యర్థులకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు జిగురు రవీందర్, అన్నారావు, సాంబశివరావు, సెగ్గం శంకర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

ఎలిగేడు: ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును ఆదివారం ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు శివపల్లిలో కలిసి సన్మానించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా కాల్వ సుజాతను నియమించడంపై మండల కేంద్రంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లంకి రాజేశం, తాటిపల్లి సతీశ్‌బాబు, నాయకులు మాడూరి మల్లేశం, మల్యాల రమణయ్య, పాత మారుతి, రమేశ్‌బాబు, నాగభూషణం, లక్ష్మన్‌కుమార్, లింగమూర్తి, రవికుమార్, గంప రాజశేఖర్, వేణుగోపాల్, తిరుపతయ్య, జనార్దన్, శ్రీనివాస్, యువజన సంఘం నాయకులు మాడూరి పృథ్వీ, విక్రమ్, మణికంఠ, ఎలగూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలి’



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క

రామగిరి: సింగరేణి సంస్థ రాజాపూర్, బుధవారంపేట గ్రామాలకు సంబంధించిన 88.20 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా గ్రామాల రైతులతో సమావేశమై అనంతరం మాట్లాడారు. గతంలో రైతలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సింగరేణి సంస్థ 708 ఎకరాల భూమి సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసిందని, రైతులందరూ కోర్టుకు వెళ్లి అవార్డు రద్దు చేసుకున్నారని తెలిపారు. మళ్లీ సింగరేణి సంస్థ 88.20 ఎకరాలు భూమి సేకరణకు నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదన్నారు. సింగరేణి సంస్థ నిర్వహించే పనులతో వచ్చే దుమ్ము, ధూళితో పాటు బ్లాస్టింగ్‌తో తీవ్ర ఇబ్బందుతుల పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ తప్పనిసరి పరిస్థితుల్లో భూసేకరణ అనివార్యమైతే తమ వ్యవసాయ భూములతో పాటు, తమ ఇళ్లను కూడా తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ తమ గ్రామాలకు చేస్తున్న అన్యాయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. రైతులు పుల్లెల కొమురయ్య, పుల్లెల సతీశ్, కాశెట్టి తిరుపతి, ఎలువాక సంపత్, కలవేన శ్రీకాంత్, మాటేటి రవి, నూనేటి లింగయ్య, కన్నూరి వెంకటి, రాయమల్లు, నరహరి, సంతోష్, చోటామియా పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ గడ్డం వంశీకృష్ణకు ఇవ్వాలి

గోదావరిఖని: పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు గడ్డం వంశీకృష్ణకు టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు పి.మల్లికార్జున్ ఒక ప్రకటనలో కోరారు. సుదీర్ఘ కాలంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం దివంగత మహానేత కాకా వెంకటస్వామి, ఆయన కుమారుడు వివేక్ ఎంతో కృషి చేశారని, వారి వారసత్వాన్ని పునికిపుచ్చుకుని పోటీ చేసేందుకు ముందుకు వస్తున్న వంశీకృష్ణ పెద్దపల్లి లోక్‌సభకు కాంగ్రెస్ తరఫున పోటీచేస్తే ఎంపీగా గెలుపు సునాయాసం అవుతుందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రామగుండం, మంచిర్యాల, పెద్దపల్లి, బెల్లంపల్లి, మందమర్రి తదితర ప్రాంతాలలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, రోడ్ల విస్తరణకు కాకాతో పాటు వివేక్ ఎనలేని కృషి చేశారన్నారు.

28 నుంచి రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

కమాన్‌పూర్: మండల కేంద్రంలో 28 నుంచి శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. 28న పాలపారక, 29న పుట్టకు పాలుపోయడం, 30న జోగు, 31న పోచమ్మ బోనాలు, ఏప్రిల్ 2న ఎల్లమ్మ బోనాలు నిర్వహిస్తామని సంఘం సభ్యులు పేర్కొన్నారు.

పెద్దపల్లి ఎంపీ టికెట్ గజ్జెల కాంతంకే ఇవ్వాలి



మాట్లాడుతున్న బొంకూరి సురేందర్ సన్నీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ టికెట్ గజ్జెల కాంతంకే ఇవ్వాలని మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ కోరారు. పెద్దపల్లిలో ఆదివారం విలేకరుల సమావేశంలో వివిధ కుల సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ పార్టీ నాయకత్వానికి సైతం ఇదివరకే తమ డిమాండ్లను నివేదించామని తెలిపారు. పార్టీ పెద్దలు పెద్దపల్లి రిజర్వు స్థానం నుంచి ఈసారి మాదిగ కులానికి చెందిన గజ్జెల కాంతంకే ఇస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి అన్నివర్గాల మద్దతుతో గెలిపించుకుంటామన్నారు. ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పొన్నం సత్తయ్యతో పాటు పలు సంఘాల నాయకులు చంద్రమౌళి, రవి, భూమయ్య, అజయ్, ఆనందరావు, లక్ష్మణ్, శంకర్, లత, స్వరూప, వినోద్, బబ్లు, ఈశ్వర్‌దాస్, నాగరాజు, సతీశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ మాదిగ సామాజిక వర్గానికే కేటాయించాలి

మంథని: కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ టికెట్ గజ్జల కాంతంకు కేటాయించాలని అంబేడ్కర్ యువజన సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, మంథని నియోజకవర్గ నాయకుడు తోకల మల్లేశ్ కోరారు. ఆదివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి గజ్జెల కాంతం విశిష్టమైన సేవలు అందించారని, ఆపద కాలంలో మంత్రి శ్రీధర్ బాబు అండగా నిలబడ్డారన్నారు. కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గానికే టికెట్ కేటాయించాలన్నారు. సంఘం జిల్లా కన్వీనర్ మంథని లక్ష్మణ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం కన్వీనర్ గజ్జెల ఆనందరావు, రాష్ట్ర కార్యదర్శులు సుద్దాల లక్ష్మణ్, గోశిక శంకర్, ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ పొన్నం సత్తయ్య, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, మహిళా నాయకురాలు కోండ్ర స్వరూప ఉన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



గాయత్రి కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పెద్దపల్లిరూరల్: మండలంలోని మారేడుగొండలో వారం రోజుల పాటు గాయత్రి డిగ్రీ, పీజీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు చేపట్టిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని ఏఎస్సై రవీందర్‌రావు అన్నారు. చెడు వ్యసనాలతో కలిగే అనర్థాలపై గ్రామీణుల్లో అవగాహన పెంచాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత కొండ రవి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సమద్, ఆమని ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్ టీచర్ల పనితీరుపై ఆధారం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల పనితీరుపై ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని సాయిమణికంఠ హైస్కూల్ 21వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో విద్యాసంస్థను నెలకొల్పి మామూలు ఫీజులతో, పట్టణ ప్రాంతంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దటం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ జైన సురేశ్‌కుమార్, ఎండీ రమాదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బావిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

సుల్తానాబాద్: వేసవి కాలంలో తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అశోక్‌నగర్ సమీపంలో ఉన్న తాగునీటి బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గట్టెపల్లి మానేరు పరివాహక ప్రాంతం నుంచి నిత్యం నీటి సరఫరా స్థానిక బావికి జరుగుతుందని, రానున్న వేసవికాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సిబ్బంది రోజూ మంచినీటి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీ అయితే సత్వరమే స్పందించి వాటిని పరిష్కరిస్తున్నామని, నిత్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల రాజమల్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు మెడికల్ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థలో విధులు నిర్వహించిన అందరికీ వైద్య సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచెందర్‌కు సీఐటీయూ యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఆదివారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌లో ఆయనను కలిసి సన్మానించారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయిస్(సీఐటీయూ) యూనియన్ అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడారు. అత్యధికులు షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన వారే కాకుండా ఉన్నత విద్యార్హతలు లేనివారు సైతం ఉద్యోగాలు పొందారని తెలిపారు. తక్కువ సర్వీస్‌తో ఉద్యోగ విరమణ చేయడంతో ఉద్యోగ విరమణ అనంతరం లభించే వైద్య సౌకర్యాలకు అనర్హులుగా మారుతున్నారని వివరించారు. పీఆర్ఎంఎస్ పథకం ప్రకారం ఉద్యోగులు 15ఏళ్ల సర్వీసులు ఉన్నవారికే వైద్య సౌకర్యం నిబంధనలు ఉన్నాయని, 15 ఏళ్ల నిబంధనను తొలగించడంతో పాటు కార్మికుల పదోన్నతికి 8వ తరగతి అర్హత నిబంధనలు తొలగించి న్యాయం చేయాలని కోరారు. భూమయ్య, రాజేశ్వర్, సంపత్, సాంబయ్య, సారయ్య, బిక్షపతి పాల్గొన్నారు.

ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడికి సత్కారం

పెద్దపల్లిరూరల్: జిల్లాకు చెందిన వడ్డె రాంచెందర్ ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడిగా నియామకం కావడంపై పెద్దపల్లికి చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు, నాయకులు దాడి సంతోష్ తదితరులు ఆయనను కలిసి సత్కరించారు. వడ్డేపల్లి తిరుపతి, జాప సంపత్‌రెడ్డి, బొంకూరి సుభాష్, చంటి శ్రీనివాస్, బుర్ర తిరుపతి పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియామకమైన వడ్డేపల్లి రాంచందర్ మొదటిసారి గోదావరిఖని ప్రాంతానికి వచ్చిన సందర్భంగా ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఆదివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం నాయకలు మధు, సమ్మయ్య, సురేశ్, రాజయ్య, లక్ష్మయ్య, సదానందం, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలను నిర్వహించనున్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 19న ఉదయం 5గంటలకు పంచామృతాలతో స్వామివారి మూల విరాట్లకు అభిషేకాలు, అర్చనలు, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 20న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం, శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, 21న ఉదయం సుదర్శన హోమం, రాత్రి వసంతోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, 22న నారసింహేష్టి, రాత్రి డోలోత్సవం, గరుడసేవ, 23న ఉదయం రథోత్సవం, సహస్ర దీపాలంకరణ, 24న పుష్పయాగం, స్వామివారి ఏకాంత సేవతో వార్షికోత్సవాలు ముగుస్తున్నాయని ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు, మధుసూదనచార్యులు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

గోదావరి నదిలో దూకేందుకు యత్నం

- మహిళను కాపాడిన పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి నదిలో దూకేందుకు ప్రయత్నించిన ఓ మహిళను గోదావరిఖని టూటౌన్ పోలీసులు కాపాడారు. వారి వివరాల ప్రకారం.. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన వివాహిత ఆదివారం నదిలో దూకేందుకు వచ్చింది. గోదావరి బ్రిడ్జిపై చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ వెంకటస్వామి గమనించి, ఆమెను అడ్డుకున్నారు. బాధిత కుటుంబసభ్యులను పిలిపించి, అప్పగించినట్లు తెలిపారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా సరిహద్దు ఏరియాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు టూటౌన్ సీఐ రవీందర్ తెలిపారు. రూ.50 వేలకు మించి వెంట ఉంచుకుంటే సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. లేకపోతే నగదు సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

సుల్తానాబాద్‌లో వర్షం

సుల్తానాబాద్: మండల కేంద్రంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి తోటలో ఉన్న చెట్లకు కాయలు రాలాయి.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పాలకుర్తి: పాలకుర్తి మండలంలో అధికారులు సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలవ్యాప్తంగా 155 మంది ప్రభుత్వ, 170 మంది ప్రైవేటు పాఠశాలలో చదువుచున్న విద్యార్థులు 325మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం రెండు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. బసంత్‌నగర్ స్టాఫ్‌కాలనీలోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలలో ఒక కేంద్రం, జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరో కేంద్రం ఏర్పాటు చేశారు.

10జీపీఏ సాధించే విద్యార్థులకు నగదు

గోదావరిఖనిటౌన్: పట్టణ పరిధిలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10జీపీఏ సాధిస్తే బాలికలకు రూ.2వేలు, బాలురకు రూ.1500 నగదు ఇవ్వనున్నట్లు సీఆర్‌పీఎఫ్ జవాన్ చిక్కులపల్లి మనోహర్ ఆదివారం తెలిపారు. జ్యోతి గాంధీఫౌండేషన్ ఆధ్వర్యంలో 1992–2003 బ్యాచ్‌కు చెందిన అనిత హైస్కూల్ పూర్వ విద్యార్థులు నగదు అందిస్తారని చెప్పారు.